అనుమతి రాక.. దారి లేక..

అటవీ అనుమతుల కొర్రీలతో నిలిచిన రహదారి పనులు

- అవస్థలు పడుతున్న గిరిజనులు
- వర్షాలు ముంచుకొస్తున్నందున స్పందించాలని వేడుకోలు


అధ్వానంగా మారిన ఎలకలగూడెం-వేములూరు రహదారి

అశ్వాపురం: ఎన్నో ఏళ్లుగా కనీస రహదారి సౌకర్యం లేక కనీస సదుపాయాలు అందక మండలంలోని మనుబోతులగూడెం, వేములూరు గ్రామాల వాసులు ఇక్కట్లు పడుతున్నారు. రహదారి నిర్మాణానికి నిధులు మంజూరైనా అటవీ శాఖ అనుమతులు లేక పనులు నిలిచిపోయాయి. కనీస రహదారి సౌకర్యం లేని మనుబోతులగూడెం, వేములూరు గ్రామాలకు రహదారి నిర్మాణానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రేగా కాంతారావు నిధులు మంజూరు చేయించారు. గొందిగూడెం నుంచి ఎలకలగూడెం రహదారికి రూ.2 కోట్లు, ఎలకలగూడెం నుంచి మనుబోతులగూడెం రహదారికి రూ.6.67 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే, మనుబోతులగూడెం రహదారికి వంతెనలు, కల్వర్టులు, రహదారికి నిధులు సరిపోవని విప్ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో మరో రూ.3.33 కోట్లు కలిపి మొత్తం రూ.10 కోట్లు మంజూరు చేశారు. ఈ పనులకు ఫిబ్రవరి 21న ఎమ్మెల్యే రేగా కాంతారావు శంకుస్థాపన చేశారు. గొందిగూడెం నుండి ఎలకలగూడెం వరకు రూ.2 కోట్లతో రహదారి పనులు సాగుతున్నా మనుబోతులగూడెం పనులు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉన్నాయి.

అనుమతుల్లో జాప్యం..

ఎలకలగూడెం నుండి మనుబోతులగూడెం వరకు రహదారి నిర్మాణానికి అటవీ శాఖ అనుమతి కావాల్సి ఉంది. వేములూరు, మనుబోతులగూడెం గ్రామాలు దట్టమైన అటవీ ప్రాంతంలో ఉండటంతో అటవీ శాఖ అనుమతుల్లో జాప్యం జరుగుతోంది. రహదారితో పాటు మార్గమధ్యలో రెండు భారీ వంతెనలు, రెండు స్లాబ్ కల్వర్టులు, 15 కల్వర్టులు నిర్మించాల్సి ఉంది. రహదారి నిర్మాణానికి ఒక హెక్టార్ వరకు ఐటీడీఏ పీఓ ద్వారా అటవీ అధికారులకు ప్రతిపాదనలు సమర్పిస్తే తిరస్కరించినట్లు సమాచారం. దీంతో మరోసారి అటవీశాఖకు నివేదించనున్నారు. కనీస రహదారి సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్న గిరిజనులకు ప్రభుత్వం రహదారికి నిధులు మంజూరు చేసినా అటవీ శాఖ అనుమతులు లేక రహదారికి మోక్షం కలగడం లేదు. రానున్న వర్షాకాలంలో కనీస రహదారి లేక గిరిజనులు కనీస సదుపాయాలు లేక ఇబ్బంది పడతారు. ఈ విషయంలో కలెక్టర్, విప్ రేగా ప్రత్యేక చొరవ చూపి రహదారి నిర్మాణానికి అటవీ అనుమతులు జారీ చేయించడంతో పాటు రహదారి నిర్మాణ పనులు వేగవంతంగా చేపట్టేలా చూడాలని గిరిజనులు కోరుతున్నారు.

అనుమతులు రావాల్సి ఉంది..



గొందిగూడెం నుంచి ఎలకలగూడెం వరకు రూ.2 కోట్లతో రహదారి పనులు జరుగుతున్నాయి. ఎలకలగూడెం నుండి మనుబోతులగూడెం వరకు రహదారికి అటవీ శాఖ అనుమతులు లేక రహదారి పనులు చేపట్టలేదు. ఐటీడీఏ పీఓ ద్వారా ఒక హెక్టారుకు అనుమతుల కోసం పంపగా అటవీ శాఖ వారు తిరస్కరించారు. అనుమతుల కోసం మరో సారి నివేదిస్తాం.

– ప్రసాద్, ఏఈ, ఐటీడీఏ

రహదారి నిర్మించాలి..



కనీస రహదారి సౌకర్యం లేక ఎన్నో ఏండ్లుగా ఇబ్బంది పడుతున్నాం. ఎమ్మెల్యే రేగా కాంతారావు ప్రభుత్వంతో మాట్లాడి రహదారికి రూ.10 కోట్లు మంజూరు చేయించారు. ఫారెస్ట్ వారి అనుమతులు లేక రహదారి పనులు చేపట్టడం లేదు. మా కష్టాలను చూసి అటవీ శాఖ వారు అనుమతులు ఇచ్చి రహదారి నిర్మాణం వెంటనే చేపట్టాలి.

– ఏనిక స్వరూప, సర్పంచ్, మనుబోతులగూడెం

క్లుప్తంగా

బాధితుడికి చేయూత


నగదు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

దమ్మపేట: క్యాన్సర్, ఊపిరితిత్తుల సంబంధిత సమస్యలతో బాధపడుతున్న యువకుడికి యువభారత్ శక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలువురు శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. మండల పరిధిలోని దమ్మపేట అర్బన్ కాలనీకి చెందిన సాకినక పవన్‌కుమార్ క్యాన్సర్ గడ్డలు, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ వంటి ఆరోగ్య సమస్యలతో హైద్రాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. పవన్ పరిస్థితి తెలుసుకున్న యువభారత్ శక్తి ఫౌండేషన్, సత్తుపల్లి వారు రూ.1లక్షా ఇరవై వేలను దాతల నుండి సేకరించారు. ఈ మొత్తం డబ్బులను ఫౌండేషన్ సభ్యులు హైదారాబాద్‌లో బాధితుడి తల్లికి వైద్య ఖర్చుల నిమిత్తం అందజేశారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

అశ్వారావుపేటరూరల్: విద్యుత్ సరఫరాలో నేడు(శనివారం) అంతరాయం కలుగుతున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ బి.వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వినాయకపురం విద్యుత్ సబ్ స్టేషన్‌కు వచ్చే 33కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా వినాయకపురం, నారాయణపురం, గంగారం సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

ఎంపీఓకు వినతి

ములకలపల్లి: శనివారం నిర్వహించనున్న ఛలో కలెక్టరేట్ కార్యక్రమానికి సెలవు మంజూరు చేయాలని కోరుతూ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీఓ లక్ష్మయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ మండలాధ్యక్షుడు ఘంటా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు చిక్కుల శ్రీనివాసరావు, మేకల రమేష్, వర్కా రుక్మాంగధరరావు, ఖమ్మంపాటి నాగరాజు, కొర్సా ప్రసాద్, కొక్కెరగడ్డ సతీశ్, వెంకటేశ్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

జేసీబీ సీజ్

దమ్మపేట: అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్న జేసీబీను రెవెన్యూ అధికారులు శుక్రవారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మండల పరిధిలోని దమ్మపేట గ్రామ శివారులో అక్రమంగా జేసీబీతో మట్టి తవ్వకాలు జరుపుతున్నారనే సమాచారం రెవెన్యూ అధికారులకు అందింది. స్పందించిన ఆర్ఐ వెంటేశ్వర్లు సంబంధిత జేసీబీని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

ప్రభుత్వ ఆస్తి ధ్వంసం చేసిన వారిపై చర్య తీసుకోవాలి

అశ్వాపురం: మండలపరిధిలోని మొండికుంటలో పాత గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలోని షాపింగ్ కాంప్లెక్స్‌ను కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్తులు శుక్రవారం కలెక్టర్ అనుదీప్, ఎస్పీ వినిత్, డీపీఓ రమాకాంత్‌కు వినతిపత్రాలు అందజేశారు. అనుమతులు లేకుండా అధికార పార్టీ అండదండలతో ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేసిన సర్పంచ్, ఉపసర్పంచ్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు విన్నవించారు.

పంచాయతీ భవనానికి శంకుస్థాపన

దమ్మపేట: మండల పరిధిలోని బాలరాజుగూడెం గ్రామంలో నూతనంగా మంజూరైన పంచాయతీ భవన నిర్మాణానికి జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సోయం ప్రసాద్, ఎంపీడీఓ నాగేశ్వరరావు, నాయకులు దొడ్డాకుల రాజేశ్వరరావు, సర్పంచ్ శ్రీను, ఎంపీటీసీ సున్నం కుమారి, ఉపసర్పంచ్ సారప్ప తదితరులు పాల్గొన్నారు.

దోమల మందు పిచికారీ

ములకలపల్లి: మండలపరిధిలోని గ్రామాల్లో శుక్రవారం దోమలమందు పిచికారీ చేశారు. మొదటి విడత స్ప్రేయింగ్‌లో ఇంటింటికీ మందు పిచికారీ చేశారు. డాక్టర్ రాజు. సబ్‌యూనిట్ ఆఫీసర్ జ్యోతురామ్, హెల్త్ అసిస్టెంట్ ఎస్.ఉప్పలయ్య, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

బూర్గంపాడు: మండలంలోని మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన రోడ్డుప్రమాదంలో గాయపడిన పెరుమాళ్ల వెంకటేశ్వర్లు, అనారోగ్యంతో బాధపడుతున్న బొజ్జా మాధవిలకు అంబేడ్కర్ యువసేన ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ4 వేల చొప్పున శుక్రవారం ఆర్థికసాయాన్ని అందించారు. ట్రస్ట్ అధ్యక్షుడు శనగ మల్లేష్, ట్రస్ట్ ప్రతినిధులు పుట్టి రాజేష్, పొందు చిట్టిబాబు, బర్ల బాబు,పిల్లి లాలయ్య, శెట్టి గోపి, బొజ్జా బొజ్జయ్య, పెరుమాళ్ల అరవింద్, సుమంత్ పాల్గొన్నారు.

ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి


ములకలపల్లి: మాట్లాడుతున్న కనకయ్య


దుమ్ముగూడెం: వినతిపత్రం అందజేస్తున్న మిడియం బాబురావు, నాయకులు


బూర్గంపాడు: వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


అన్నపురెడ్డిపల్లిలో..


భద్రాచలంఅర్బన్: ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

ములకలపల్లి: అర్హులైన పేదలకు వెంటనే ఇళ్లస్థలాలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో ప్రదర్శన నిర్వహించారు. బస్టాండ్ సెంటర్ నుండి తహసీల్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించి, ధర్నా చేశారు. అనంతరం ఆర్ఐ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. పార్టీ మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, ఊకంటి రవికుమార్, గౌరి నాగేశ్వరరావు, పొడియం వెంకటేశ్వర్లు, మాలోతు రావూజా, నిమ్మల మధు, కుంజా రామ్మూర్తి, గోపగాని లక్ష్మీనర్సయ్య, బైరు ప్రసాద్, గడ్డం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భద్రాచలంఅర్బన్: గృహలక్ష్మీ పథకంలో ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలకు నిధులు పెంచాలని, డబుల్ బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేయాలని ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పలు డిమాండ్లతో శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ, ఐద్వా, వ్యకాస, డీవైఎఫ్ఎస్ఐ, కేవీపీఎస్ సంఘాల ప్రతినిధులు, ప్రజలు ధర్నా నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ పట్టణ కన్వీనర్ ఎంబీ.నర్సారెడ్డి అధ్యక్షతన జరిగిన ధర్నాలో ఉపాధ్యక్షుడు గడ్డం స్వామి, కో కన్వీనర్ ఎం.రేణుక, కార్యదర్శి లక్ష్మి, జ్యోతి, లీలావతి, కుసుమ, జీవనజ్యోతి, వనమ్మ, నాగరాజు, సంతోష్, లక్ష్మణ్, రామకృష్ణ, రాము, జాకీ, కాపులు రవి, వెంకటరామారావు, సిహెచ్.మాధవరావు, శ్రీను, విజయ, డీవైఎఫ్ఎస్ఐ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు సతీష్, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.


ఏకకాలంలో 'పోడు' పట్టాలివ్వాలి

దుమ్ముగూడెం: పోడుసాగుదారులకు ఏకకాలంలో పట్టాలు పంపిణీ చేయాలని టీఏజీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబురావు డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల ఐక్యవేదిక తరపున తరతరాలుగా పోడు భూములు సాగు చేస్తున్న వారందరికీ ఏకకాలంలో పట్టాలు పంపిణీ చేయాలి, ధర్నా చేసి సీనియర్ అసిస్టెంట్ నరసింహారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమస్యలన్నీ పరిష్కారం చేయకుంటే భవిష్యత్తులో ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలు చేపడుతామని హెచ్చరిక చేశారు. ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కారం పుల్లయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మర్మం చంద్రయ్య, మండలాధ్యక్షుడు సోయం వీర్రాజు, నాయకులు సోయం లక్ష్మీనర్సు, చిన్నారావు, చిలకమ్మా, సారయ్య ,అప్క బాబు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి: పోడు సాగుదారులందరికీ ప్రభుత్వం పట్టాలు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండపల్లి శ్రీధర్ నాయబ్ తహసీల్దార్ రాంనరేష్‌కు వినతిపత్రం అందజేశారు. మండలంలోని జరిగిని నిరసన కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జంగిలి వెంకటరత్నం, నాగేశ్వరరావు, శంకర్ పాల్గొన్నారు.

బూర్గంపాడు: అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో తహసీల్ వద్ద ఆందోళన చేపట్టారు. బూర్గంపాడు మార్కెట్‌యార్డు నుంచి తహసీల్ కార్యాలయం పేదలతో కలసి ప్రదర్శన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ భగవాన్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు, నాయకులు బయ్యా రాము, పాపినేని సరోజిని, ఎస్‌కె.అబీదా, బర్ల తిరుపతయ్య, కొమ్రరాజు సత్యనారాయణ, అప్పారావు, నాగేశ్వరరావు, విలాసాగర్ రజని, కమటం మరియమ్మ పాల్గొన్నారు.

బడిలోకి పోటెత్తిన వర్షపునీరు..


అశ్వారావుపేటరూరల్: పాఠశాల ఆవరణ, గేటు వద్ద పోటెత్తిన వర్షపునీరు

అశ్వారావుపేటరూరల్: గురు, శుక్రవారాల్లో కురిసిన చిన్నపాటి వర్షాలకే మండలంలోని వినాయకపురం ప్రాథమిక పాఠశాలలో వర్షపు నీరు పోటెత్తింది. పాఠశాల ఆవరణ, వంటగది, వర్షపు నీటితో నిండిపోయింది. దీంతో వంట, విద్యార్థులకు తీవ్ర ఇబ్బంది ఎదురైంది. ఇటీవలే సుమారు రూ.6 లక్షలకు పైగా నిధులు ఖర్చు చేసి మన ఊరు- మన బడి కార్యక్రమంలో మరమ్మతులు చేశారు. అంత ఖర్చు చేసినా వరద సమస్యకు మాత్రం పరిష్కారం దొరకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

భూపతిరావుకు సన్మానం


భూపతిరావును సన్మానిస్తున్న సభ్యులు

భద్రాచలంఅర్బన్: దశాబ్ది ఉత్సవాల్లో 'హరితోత్సవ్' పురస్కారాన్ని అందుకున్న భద్రాద్రి వాసి లయన్ డా.గోళ్ల భూపతిరావుని విశ్రాంత ఉద్యోగులు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. పట్టణంలో మొక్కల సంరక్షణకు భూపతిరావు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘం భద్రాచలం అధ్యక్షుడు భూషణ్ రావు, వెంకన్న, సుబ్బరాజు, హనుమంతరావు, సిద్దులు, దమయంతి, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

గంగానమ్మకు కుంకుమ పూజలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుమ్మడవల్లి సమీపంలోని పెదవాగు ప్రాజెక్ట్ వద్దగల శ్రీ గంగానమ్మ తల్లి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి శుక్రవారం కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారికి నూతన వస్త్రాలను ధరించి, పూలమాలతో అలంకరించారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకొని వివిధ రకాల పూజలు చేశారు.

రూ.1.50 లక్షల విరాళం

భద్రాచలంటౌన్: పట్టణంలోని జూనియర్ కళాశాల సెంటర్‌లోని సాయిబాబా ఆలయంలో స్వర్ణ సింహాసనం, మకర తోరణానికి ఓ భక్తుడు విరాళం అందజేశాడు. హైదరాబాద్‌కు చెందిన పెద్దిరెడ్డి బాల నాగేందర్, ప్రేమ కుమారి దంపతులు, పెద్దిరెడ్డి విశ్వనాథ్, సింధు, పులిజాల శోభారాణి శుక్రవారం బాబావారిని దర్శించుకుని రూ.1.50 లక్షల చెక్కును ఆలయ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు దాతలను శాలువలతో సత్కరించి జ్ఞాపిక ప్రసాదం అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు తుమ్మలపల్లి సత్యనారాయణమూర్తి, వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బీఎస్పీలో చేరిక

చర్ల: మండలంలోని తేగడ పంచాయతీలోని మేడివాయికాలనీకి చెందిన వివిధ పార్టీలకు చెందిన 50 కుటుంబాలు శుక్రవారం బీఎస్పీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ మండలాధ్యక్షులు కూరపాటి వీర్రాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ తడికల శివకుమార్ మాట్లాడారు. పార్టీ మండల ఉపాధ్యక్షుడు సూదుల సంతోష్, నాయకులు చెన్నం సాయి, కోగిల నాగేంద్ర, గద్దల ముత్యాలరావ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రైల్వేలైన్ నిర్వాసితుల దీక్ష

మణుగూరు రూరల్: బీటీపీఎస్ రైల్వేలైన్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న తమకు ఆర్ అండ్ఆర్ ప్యాకేజీ, ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వాసితులు చేపట్టిన రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం వీరి దీక్షకు తుడుందెబ్బ జిల్లా నాయకులు వర్సా శ్రీనివాస్ సంపూర్ణ మద్దతును తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు, రైల్వే లైన్ నిర్వాసితులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి సహకరించాలి


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మెచ్చా

దమ్మపేట: అశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలోని ఆలయాల అభివృద్ధికి సహకరించి, నిధులు మంజూరు చేయాలని కోరుతూ దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డికి, స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు వినతి పత్రం అందజేశారు. శుక్రవారం హైదారాబాద్‌లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని, ఎమ్మెల్యే మెచ్చా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని పురాతన దేవాలయాల అభివృద్ధి, నూతనంగా నిర్మించబోయే ఆలయాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్యేతో పాటు నాయకులు దారా బాబు, నలమోతు వెంకటనారాయణ, శ్రీను, స్వామి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర నిధులతోనే అభివృద్ధి


భద్రాచలంటౌన్: కేంద్ర పథకాలు వివరిస్తున్న బీజేపీ నాయకులు


మణుగూరు రూరల్: ప్రచారం చేస్తున్న నాయకులు

భద్రాచలంటౌన్: పట్టణంలో బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ముమ్మరంగా ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు గత కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో కూడా ప్రజా సంక్షేమ పాలన రావాలంటే రాబోయే ఎన్నికల్లో బీజేపీని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కుంజా సత్యవతి, జిల్లా కార్యదర్శి రాజు బెహారా, నాగబాబు, రామ్మోహన్‌రావు, క్రాంతికుమార్, వెంకన్న, శ్రీనివాస్, సుదర్శన్, ముక్తేశ్వరరావు, కేశవ్, నిఖిల్, సాయి పాల్గొన్నారు.

మణుగూరు రూరల్: దేశంలో ప్రధాని మోదీ పాలనపై బీజేపీ మండల, పట్టణ కమిటీల ఆధ్వర్యంలో గ్రామాల్లో ఇంటింట ప్రచారం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జంపన సీతారామరాజు, నియోజకవర్గ కన్వీనర్ పున్నం భిక్షపతి, మండలాధ్యక్షుడు కుంజా రామకృష్ణ, నాయకులు కిషోర్, భిక్షపతి, రామకృష్ణం రాజు, నాగేశేషు, రవికుమార్, మురళీమోహన్‌రాజు, నాయకులు రమేష్, భూక్యా ప్రసాద్, ఎర్రోజు నాగమణి, రేణుక, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి నివాళి

అశ్వాపురం: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, బీజేపీ సిద్ధాతకర్త డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో శుక్రవారం బీజేపీ నాయకులు శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ రాష్ట్ర నాయకుడు ముస్కు శ్రీనివాసరెడ్డి, కిసాన్ మోర్చా మండలాధ్యక్షుడు కొల్లు లింగారెడ్డి, నాయకులు గోసుల రాములు, వెంకటేశ్వరరావు, సోమ కృష్ణకుమారి, వెంకటరెడ్డి, మురళి, శ్రీరాం పాల్గొన్నారు.

మణుగూరురూరల్: బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సీతారామరాజు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆలయ కమిటీ ప్రమాణస్వీకారం

దుమ్ముగూడెం: దుమ్ముగూడెంలోని శ్రీ ఆత్మారామ స్వామి ఆలయ నూతనపాలక కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారం శుక్రవారం ఆలయ ప్రాంగణంలో దేవాదాయ శాఖ అధికారులు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా గోర్సా అశోక్, సభ్యులుగా కెల్లా శేఖర్, కుప్పిలి చిట్టిబాబు, ఉబ్బా నర్సింహారావు, కుర్సం రాజు, జిలకర ఉదయకుమారి, కంచర్ల స్వరూపలతో ఆలయ అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రేసు లక్ష్మీ, దేవాలయ కార్యనిర్వాహక అధికారి ఎ.సుధాకర్, భద్రాచలం దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కణితి రాముడు, నాయకులు జానిపాషా, తునికి కామేష్, దామెర్ల శ్రీనివాసరావు, మోతుకురి శ్రీకాంత్, వెంకటేశ్వరావు, గంగరాజు, జెట్టి రామకృష్ణ, జుంజూరి జయసింహ, గోర్సా లక్ష్మణ్ రావు, సింగరయ్య, విశ్వ, వాసు, మోహనరావు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సన్నాహక సమావేశం

మణుగూరు రూరల్: ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సైన్యం భవిష్యత్ కార్యాచరణపై పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శుక్రవారం గుట్టమల్లారం హనుమాన్ ఫంక్షన్ హాల్‌లో ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో వైఎస్ ఎంపీపీ కరివేద వెంకటేశ్వరరావు, ఉపసర్పంచులు పుచ్చకాయల శంకర్, గోరంట్ల కనకయ్య, సుబ్బారెడ్డి, మధుకుమార్, వెంకన్న, శ్రీనివాసరావు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమం పట్టదా..?

బూర్గంపాడు: భద్రాచలం ఐటీడీఏకి గిరిజన సంక్షేమం పట్టదా అని సీపీఐ మండల కార్యదర్శి మువ్వా వెంకటేశ్వరరావు ప్రశ్నించారు. శ్రీరాంపురం ఎస్టీకాలనీని శుక్రవారం సీపీఐ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు సారపాకకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీరాంపురం ఎస్టీ కాలనీ అన్నింటా వెనుకబడి ఉందన్నారు. రహదారి లేకపోవటంతో నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన పాఠశాలలో కూడా కనీస వసతులు లేవన్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ గ్రామంపై దృష్టి పెట్టి కనీస వసతులు కల్పించాలన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం..


అవగాహన కల్పిస్తున్న ఎస్సై రాజారామ్

కరకగూడెం: సైబర్ నేరాలపై తప్పనిసరిగా అవగాహన ఉండి, తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై రాజారామ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దన్నా రు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు డయల్ చేయాలన్నారు. ఈ అవగాహన సదస్సులో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరం

భద్రాచలంటౌన్: స్థానిక కూనవరం రోడ్డులోని సరోజమ్మ ఆశ్రమంలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ రాకేష్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఆశ్రమ నిర్వాహకురాలు సరోజమ్మ, గంగిశెట్టి వీరయ్య, విజయ్‌కుమార్, విజయలక్ష్మి, దుర్గ, సరోజిని, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం..

పట్టణంలోని శ్రీఅహోబిల మఠం వేదికగా శ్రీనరసింహ సేవా వాహిని ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన వచ్చినట్లు సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ కృష్ణ చైతన్య తెలిపారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న వారి కోసం ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి యువత స్వచ్ఛందంగా రక్తదానం చేశారన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని ధర్నా


ధర్నా నిర్వహిస్తున్న గ్రామస్తులు, నాయకులు

చర్ల: మండలంలోని కొయ్యూరు గ్రామ పంచాయతీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో గ్రామస్తులు, మహిళలు ఖాళీ బిందెలతో ధర్నా నిర్వహించారు. కొయ్యూరులోని ప్రధాన రహదారిపై బైటాయించిన పంచాయతీ పరిధిలోని కొయ్యూరు, రేగుంట, సుందరయ్యకాలనీ గ్రామాలకు చెందిన గిరిజనులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. సమాచారం తెలుసుకున్న చర్ల తహసీల్దార్ బి.భరణిబాబు అక్కడికి చేరుకొని సమస్య పరిష్కారానికి మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడారు. సమస్య ఎరిష్కారమయ్యేంత వరకు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. పార్టీ మండల కార్యదర్శి కొండా చరణ్, నాయకులు నాగరాజు, మునిగెల శివ, నాగబాబు, దుర్గయ్య, సాంబ, సారయ్య, ప్రసాద్, సత్యం, నర్సీరత్నం, పద్మ, దుర్గ, జ్ఞానమ్మ, వరలక్ష్మి పాల్గొన్నారు.